# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 14-01-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

❖ వాతావరణానికి అనుకూలంగా ఉండేలా భారతదేశాన్ని మార్చేందుకు మిషన్ మౌసమ్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈరోజు ప్రారంభించారు.

❖ మహాకుంభ మేళాలో భాగంగా త్రివేణి సంగమంలో ఇప్పటివరకూ 3 కోట్ల 50 లక్షల మందికి పైగా భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించారు.

❖ నిజామాబాద్ కేంద్రంగా జాతీయ పసుపు బోర్డును కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖా మంత్రి పియూష్ గోయల్ ప్రారంబించారు.

❖ దేశానికి సైనికులు అందించిన అమూల్యమైన సేవలకు గుర్తుగా సాయుధ దళాల మాజీ సైనికుల దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం.

❖ ప్రపంచ వేదికపై భారత్ గణనీయంగా ఎదుగుతోందని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ పేర్కొన్నారు.

============================

వాతావరణానికి అనుకూలంగా ఉండేలా భారతదేశాన్ని మార్చేందుకు "మిషన్ మౌసమ్"ను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించారు. ఈరోజు న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన భారత వాతావరణ శాఖ (ఐఎండీ) 150వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రధానమంత్రి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మిషన్ మౌసమ్ ప్రారంభం భవిష్యత్తు సంసిద్ధత పట్ల దేశ నిబద్ధతను సూచిస్తుందన్నారు. ఐఎండీ లక్షలాది మంది భారతీయులకు సేవ చేయడమే కాకుండా భారతదేశ శాస్త్రీయ పురోగతికి చిహ్నంగా కూడా మారిందని నరేంద్ర మోడీ ప్రశంసిస్తూ...

(వాయిస్ 42 సెకన్లు)

============================

ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభ్‌లో మకర సంక్రాంతి అమృత స్నానం కొనసాగుతోంది. ఇప్పటివరకూ అందిన సమాచారం మేరకు త్రివేణి సంగమంలో 3 కోట్ల 50 లక్షల మందికి పైగా భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించారు. పవిత్ర స్నానాల తర్వాత, భక్తులు ఘాట్ల వద్ద పూజలు చేసి ప్రార్థనలు చేస్తున్నారు. సాంప్రదాయాన్ని పాటిస్తూ.. పండుగ పవిత్రతను మరింత పెంచే దాన ధర్మాలలో కూడా పాల్గొంటున్నారు. ఈ రోజు ఉదయం ప్రజలు పెద్ద సంఖ్యలో గంగా హారతిలో కూడా పాల్గొన్నారు.

=============================

భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ స్పెయిన్ లో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా స్పెయిన్ విదేశాంగ మంత్రి జోస్ మాన్యువల్ అల్బరీస్ తో సమావేశమై చర్చలు జరిపారు. అనంతరం ప్రవాస భారతీయులు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ... భారతదేశం - స్పెయిన్ మధ్య సంబంధాలు గణనీయమైన పురోగతికి చేరుకుంటున్నాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా భారతదేశపు "సబ్ కా సాథ్... సబ్ కా వికాస్.. సబ్ కా విశ్వాస్" విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. ప్రపంచ వేదికపై భారత్ ఎదుగుతున్న తీరుని ప్రస్తావిస్తూ.. గత 10 సంవత్సరాల్లో భారత్ అనేక రంగాల్లో వృద్ధి సాదిస్తోందన్నారు. ఒక నెలకి 1,600 కోట్లకు పైగా నగదు రహిత లావాదేవీలు జరుపుతోందని జైశంకర్ వెల్లడిస్తూ...

(వాయిస్ 40 సెకన్లు)

=============================

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) నూతన ఛైర్మన్‌గా డాక్టర్ వి.నారాయణన్ ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. ఎస్. సోమనాథ్ స్థానంలో ఆయన నియమితులయ్యారు. విశిష్ట శాస్త్రవేత్తగా ఇస్రోలో దాదాపు 4 దశాబ్దాల అనుభవం ఉన్న నారాయణన్ అంతరిక్ష శాఖ కార్యదర్శిగానూ సేవలందించనున్నారు.

=============================

దేశానికి సైనికులు అందించిన అమూల్యమైన సేవలకు గుర్తుగా సాయుధ దళాల మాజీ సైనికుల దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. 1953లో ఈ రోజున పదవీ విరమణ చేసిన భారత సైన్యానికి మొదటి కమాండర్ - ఇన్ - చీఫ్ ఫీల్డ్ మార్షల్ కె.ఎం. కరియప్ప అందించిన సేవలను గుర్తిస్తూ.. సాయుధ దళాల మాజీ సైనికుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్, ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి. సింగ్ తెలిపారు. ఈరోజు ఆయన న్యూఢిల్లీలో జరిగిన 9వ సాయుధ దళాల మాజీ సైనికుల దినోత్సవంలో మాట్లాడుతూ...

(వాయిస్ 26 సెకన్లు)

ఇదిలా ఉండగా దేశాన్ని కాపాడటంలో సైనికుల త్యాగాలు, ధైర్యం అచంచల నిబద్ధతను గుర్తిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈరోజు సామాజిక మాధ్యమం వేదికగా నివాళి అర్పించారు.

విరామం

=============================

కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పియూష్ గోయల్ జాతీయ పసుపు బోర్డును ప్రారంభించారు. నిజామాబాద్ కేంద్రంగా జాతీయ పసుపు బోర్డును ప్రారంభించామని ఈరోజు ఆయన న్యూఢిల్లీలో పాత్రికేయులకు వివరించారు. దేశవ్యాప్తంగా వేడుకలు జరుపు కుంటున్న ఈ శుభ సమయంలో పసుపు బోర్డు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పసుపు ఉత్పాదకతను పెంచడానికి ఈ బోర్డు కృషి చేస్తుందన్నారు. రైతుల

సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ వహించడానికి, అలాగే విలువ ఆధారిత ఉత్పత్తులను అభివృద్ధి చేయడంతో పాటూ పసుపు ఉత్పత్తుల ఎగుమతులపై పసుపు బోర్డు దృష్టి సారిస్తుందని మంత్రి పీయూష్ గోయల్ వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు చేయడంపై నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ హర్షం వ్యక్తం చేశారు. ఈ బోర్డు కారణంగా ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని ఆయన మాట్లాడుతూ...

(వాయిస్ 20 సెకన్లు)

==============================

జమ్ము కశ్మీర్ రాజౌరి జిల్లాలోని నియంత్రణ రేఖ (LOC) వెంబడి ప్రమాదవశాత్తు జరిగిన పేలుడులో ఆరుగురు సైనికులు గాయపడ్డారు. రాజౌరి జిల్లాలోని నౌషెరా ప్రాంతంలోని భవానీ సెక్టార్‌లోని మక్రి ప్రాంతంలో సాధారణ గస్తీ సమయంలో ఒక సైనిక బృందం పొరపాటున ఒక ల్యాండ్ మైన్‌పై కాలు వేయడంతో ఈ పేలుడు సంభవించింది.

==============================

మకర సంక్రాంతి, పొంగల్, బిహు, ఉత్తరాయణ పండుగలను ఈరోజు దేశవ్యాప్తంగా సాంప్రదాయ ఉత్సాహంతో జరుపుకుంటున్నారు. సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే శుభ సందర్భాన్ని సూచికంగా ఈ పండుగలను జరుపుకుంటారు. ఈ సందర్భంగా ప్రజలు నదులలో పవిత్ర స్నానాలు ఆచరిస్తున్నారు. సాంప్రదాయ ఆహారాన్ని వండుకొని స్నేహితులు ,కుటుంబ సభ్యులతో పంచుకుంటారు. పశ్చిమ భారతదేశంలోని ఇతర ప్రాంతాలలో దీనిని గాలిపటాల పండుగగా కూడా జరుపుకుంటున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగలు ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందాన్ని తెస్తాయని, ఐక్యత స్ఫూర్తిని మరింత పెంచుతాయని సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు.

==============================

ఆస్ట్రేలియన్ ఓపెన్ టెన్నిస్‌లో భాగంగా భారతదేశానికి చెందిన రోహన్ బోపన్న అతని నూతన కొలంబియన్ భాగస్వామి నికోలస్ బారియంటోస్ జోడీ ఈరోజు పురుషుల డబుల్స్ మొదటి రౌండ్‌లో నిష్క్రమించారు. ఈ జోడీ స్పానిష్ ద్వయం పెడ్రో మార్టినెజ్, జౌమ్ మునార్ చేతిలో 5-7, 6-7 తేడాతో వరుస సెట్లలో ఓడిపోవడంతో ఆస్ట్రేలియన్ ఓపెన్ నుంచి నిష్క్రమించవలసి వచ్చింది.

==============================
==============================